క్లుప్తంగా

19న దుర్గ గుడి చైర్మన్ రాంబాబుకు సన్మానం

విజయవాడరూరల్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు కు ఈ నెల 19వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో సన్మానం జరుగుతుందని రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి రాంబాబు(కె.తాడేపల్లి) ఒక ప్రకటనలో తెలియచేశారు. అదే రోజు రాష్ట్ర సగర సంఘం ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, కార్యక్రమానికి సగర కులానికి చెందిన ఉద్యోగులు, మహిళలు, యువకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టెన్త్ మోడల్ టెస్ట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



ఇబ్రహీంపట్నం: ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్త్‌క్లాస్ ప్రజ్ఞా వికాస మోడల్ టెస్ట్‌లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. స్థానిక కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల, క్రాంతి కాన్వెంట్ బాలబాలికలకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు వీటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలిరెడ్డి, కరస్పాండెంట్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు వడ్డీ రాయితీ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసినట్లు కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు పాత బకాయిలపై కూడా ఈ మాఫీ వర్తిస్తుందని, ఈ నెల 31వ తేదీ లోపు పూర్తి బకాయి చెల్లిస్తేనే ఈ వెసులుబాటు పొందవచ్చని తెలిపారు. ఖాళీ స్థలాలు, కట్టడాలకు ఈ రాయితీ వర్తిస్తుందని కూడా వెల్లడించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తిరువూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తిరువూరులో శుక్రవారం జరిగాయి. ఇంగ్లిషు సబ్జెక్టులో నిర్వహించిన పరీక్షకు 63 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 344 మంది విద్యార్థులకు 304 మంది హాజరు కాగా, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రంలో 380 మందికి గాను 364 మంది, నాగార్జున కళాశాల కేంద్రంలో 218 మందికి గాను 211 మంది పరీక్షలు రాసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపవద్దు

నూజివీడు: హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపవద్దని, వారిని ప్రేమతో ఆదరించాలని చైల్డ్‌ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్‌పర్సన్ సురేష్‌కుమార్ అన్నారు. నూజివీడులో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో కృష్ణాజిల్లా చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టిగ్మా రిడక్షన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు మెరుగైన మందులు, వైద్యచికిత్స ఉన్నాయని, దీని ద్వారా వారి జీవిత కాలం పెరుగుతుందన్నారు. అనంతరం హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ సుందరరావు, లింకు వర్కర్లు పాల్గొన్నారు.

వేసవిలో సైతం నిరంతరం తాగునీటి సరఫరా

- 1968లో 14 గ్రామాలకు పథకం ఏర్పాటు
- నేడు 95 గ్రామాలకు విస్తరణ
- రోజుకు 27,500 ఎంఎల్‌డీ నీరు సరఫరా



ఇబ్రహీంపట్నం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో నీటిని శుద్ధి చేసే క్యారిప్యాకులేటర్ ప్లాంట్

ఇబ్రహీంపట్నం: వేసవికాలంలో సైతం ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. నిరంతరం తాగునీరు సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేస్తోంది. కృష్ణానది నీటి సౌలభ్యంతో 55 ఏళ్ల క్రితం 14 గ్రామాల తాగునీటి అవసరాల కోసం మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 2004, 2016లో ఈ పథకాన్ని విస్తరించారు. మైలవరం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 95 ఆవాస గ్రామాల ప్రజలకు ప్రతిరోజు 27,500 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) సరఫరా చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

1968లో కృష్ణానదిలో పథకం ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర ప్రాంతాల్లోని 14 గ్రామాలను దృష్టిలో ఉంచుకుని సమీపంలో ఉన్న కృష్ణానదిలో యునిసెఫ్ వారి సహకారంతో బావి ఏర్పాటుచేశారు. అందులో నుంచి మోటార్ల ద్వారా ఇబ్రహీంపట్నం కొండపై నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీళ్లు ఎక్కించేవారు. అక్కడి నుంచి పరిసర ప్రాంతాలకు తాగునీటిని పైపుల ద్వారా సరఫరా చేశారు. అంచెలంచెలుగా మండలంలోని గ్రామాలకు కృష్ణాజలాలు సరఫరా అయ్యేవి. పైపుల లీకేజీ సమస్యలు, క్లోరినేషన్ పనులు పర్యవేక్షిస్తారు.

పథకం విస్తరణతో 95 గ్రామాలకు తాగునీరు

మండలంలోని గ్రామాలకు తాగునీటి పథకం విస్తరణ పనులు 2004లో చేపట్టారు. ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌కు కృష్ణానది ద్వారా వచ్చే నీటితో 17.5 ఎంఎల్‌డీ (17.5 లక్షల) లీటర్లు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేశారు. శుద్ధిచేసిన నీటిని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాల్లోని గ్రామాలకు పంపిణీ చేశారు. 2016లో మరోసారి 10ఎంఎల్‌డీ (10 లక్షల లీటర్లు) వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు జరిగింది. దీంతో శుద్ధి చేసిన తాగునీరు మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు సరఫరా అవుతోంది.

పురా పథకం వచ్చి ఉంటే ఊతంగా ఉండేది

2013లో కేంద్ర ప్రభుత్వం పురా పథకం (ప్రొవిజన్ ఆఫ్ అర్బన్ ఎమినిటీస్ ఇన్ రూరల్ ఏరియాస్) ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రూ.189.4 కోట్లతో పనులు చేపట్టేందుకు అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో శిలాఫలకం ప్రారంభించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ రద్దుచేసి రూ.157 కోట్లకు కుదించారు. అందులో ఇంటింటి కుళాయి పథకంకు రూ.56.50 కోట్లు కేటాయించి పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్స్, ఏరియేటర్ వంటివి నిర్మించారు. పైప్‌లైన్ వేస్తే పథకం అందుబాటులోకి వచ్చేది. 2014లో వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పుర పథకాన్ని తిరిగి తెరపైకి తెచ్చారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఇంతియాజ్‌తో కలసి పురా ప్రణాళిక మరలా కేంద్రానికి నివేదించారు. ఇది కార్యరూపం దాలిస్తే ఇక ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఢోకా ఉండదు.

వేసవి ఎద్దడి నివారణకు చర్యలు

ఇబ్రహీంపట్నంలోని గ్రామీణ సమగ్ర మంచినీటి పథకం ద్వారా మైలవరం నియోజకవర్గంలోని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతోంది. వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాం. సిబ్బందితో పైప్‌లైన్ పనులు, క్లోరినేషన్ జరిగేలా చూస్తున్నాం.

– దయానంద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, మైలవరం

ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్



మైలవరంలో బాలికల అక్రమ రవాణా, ట్రాఫికింగ్‌పై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న చంద్రయ్య

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త వై.చంద్రయ్య తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సీడీపీఓ సంయుక్త ఆధ్వర్యంలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీపై అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 26,500 మంది యువతులను, మహిళలను కాపాడి వారికి పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. మైలవరం సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ ఏ అమ్మాయి కూడా అక్రమ రవాణాకు గురి కాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శోభ, శ్రీలత, తులసీ, గౌసియా బేగం, శ్రావ్య శృతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి సోలార్ స్నేక్ గార్డ్ ప్రాజెక్ట్ ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్ తయారు చేసిన నాగమాలికను అభినందిస్తున్న గైడ్ శ్రీదేవి

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): కొత్తచిలుకూరు ఎంపీయూపీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని షేక్ నాగమాలిక రూపొందించిన సోలార్ స్నేక్‌గార్డ్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైంది. ఇళ్లు, పొలాలు, వైద్యశాలల్లో పెద్దలు, చిన్నారులను పాములు కాటు వేయకుండా రక్షణ పొందే విధంగా ఈ ప్రాజెక్ట్ రూపొందించింది. ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు ఎంఈవో పుష్పలత, గైడ్ ఉపాధ్యాయురాలు టి.శ్రీదేవి, జిల్లా సైన్స్ అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్‌వీఎస్ విజయలక్ష్మి, హెచ్ఎం రమేష్‌బాబు తదితరులు బాలికను అభినందించారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన పోలీసు అధికారులు



తిరువూరులో సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీలు

తిరువూరు: జగనన్న విద్యాదీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమానికి ఆదివారం తిరువూరుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లను విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీలు విశాల్ గున్నీ, మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని హెలిపాడ్ వద్ద సిగ్నలింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీచేశారు. హెలిపాడ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా సభా ప్రాంగణానికి వెళ్లే మండల పరిషత్ రోడ్డులో ఆక్రమణలు తొలగించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను స్థానిక అధికారులకు వివరించారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



బీసీ సంక్షేమ గురుకుల హాస్టల్‌లో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత్తు పదార్థాల నిర్మూలన, వాటి వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. మత్తు పదార్థాల వినియోగంతో మానసిక, ఆరోగ్య, ఆర్థిక పరంగా ఇబ్బందులకు గురవుతారని సంస్థ ఏరియా కోఆర్డినేటర్ ప్రియాంక తెలిపారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు కిడ్నీ, టీబీ, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి డీ-ఎడిక్షన్ చికిత్సతో బయటపడొచ్చన్నారు. వివరాలకు 94904 92020లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని అందిస్తున్న సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్

రెడ్డిగూడెం: అంగన్‌వాడీ కేంద్రాలలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, ఎంఎల్‌హెచ్‌పీ గుంటక వెంకటరమణ, ఏఎన్ఎం విమలరాణి, చాట్ల ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ కార్యక్రమంపై కరపత్ర ప్రచారం

మైలవరం: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన కార్మికులు, రైతులు, సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అంబానీ, అదానీ సేవలో మోదీ మునుగుతున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షురాలు ఎర్రంశెట్టి వీరమ్మ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు అంబటి శివ, చంద్రరావు, సంధ్య, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మారిన వాతావరణంతో రైతుల్లో ఆందోళన



కల్లాలపై ఉన్న మొక్కజొన్న పంట

చాట్రాయి: మారిన వాతావరణంతో మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రబీలో సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న వేశారు. ప్రస్తుతం పంట కోత దశకు రాగా మరికొన్ని చోట్ల కల్లాలపై ఆరబెట్టారు. శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పండించిన పంట చేతికి అందుతుందో లేదోనని కలవరపడుతున్నారు. నిలువు మీద ఉన్న పంట తడిస్తే మొక్కలు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి: అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ సూచించారు. మండలంలోని చాట్రాయి గ్రామంలో శుక్రవారం కోత దశకు వచ్చిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో కల్లాలపై ఉన్న మొక్కజొన్న పంటను పరదాలతో కప్పుకుని వర్షపు నీరు కల్లాల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, ప్రస్తుతం పంట కోత దశలో, మరికొన్ని చోట్ల పంట కోసి కల్లాలపై, నిలువు ఉన్న పంట భూమిలో నీరు నిల్వ లేకుండా కాలువలు ద్వారా బయటకు పంపించుకునేందుకు వర్షాల సమయంలో రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాట్రాయి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, అర్హత ఉండీ రాని వారు ఎవరైనా ఉన్నారా, గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఎలా ఉంది, ఉద్యోగుల పనితీరు ఎలా ఉందని ప్రజల్ని అడగ్గా అన్నీ బాగానే ఉన్నాయని ప్రజలు సబ్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, వ్యవసాయ అధికారి బి.శివశంకర్, పంచాయతీ కార్యదర్శి నిస్సార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

మైలవరం: గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు ఎం.శ్రీనివాసులు తెలిపారు. మైలవరంలోని నూజివీడు రోడ్డులో ఉన్న సీఎంఆర్ కల్యాణ మండపంలో రీ సర్వేకు సంబంధించి శుక్రవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల తహసీల్దారులు, డెప్యూటీ తహసీల్దారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు గ్రేడ్1, గ్రేడ్2, సర్వేయర్లతో జరుగుతున్న పనులపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జి.కొండూరు తహసీల్దారు రోహిణీదేవి, ఇబ్రహీంపట్నం తహసీల్దారు సూర్యారావు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ డివిజన్‌లోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జి.కొండూరు: మండల కేంద్రం జి.కొండూరు, కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో నెలవారీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 69 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు శుక్రవారం 69 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీశారద జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో 1,639 మంది విద్యార్థులకు గాను 1,570 మంది పరీక్షలకు హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 372 మందికి 345 మంది హాజరు కాగా, 27 మంది గైర్హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 362 మందికి గాను 348 మంది పరీక్ష రాయగా, 14 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శారద కళాశాలలో 532 మందికి 518 మంది పరీక్ష రాయగా, 14 మంది గైర్హాజరయ్యారు. శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలో 373 మందికి గాను 359 మంది పరీక్ష రాయగా, 14 మంది పరీక్ష రాయలేదు.

వైభవంగా జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో కోదండ రామచంద్ర స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మండలంలో పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామంలోని అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు స్వామి వారికి నూతన వస్త్రాలు అందజేశారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం

విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం విస్సన్నపేట ఏరియా యూనిట్ వార్షికోత్సవం స్థానిక సంఘ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు ఎస్.సూరిరాజు శుక్రవారం తెలిపారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించటంతో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులకు సన్మానం జరుగుతుందన్నారు.ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా అధ్యక్షుడు లవకుమార్ పాల్గొంటారన్నారు.

నూజివీడు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం



నూజివీడు: నూజివీడు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా ఇందుపల్లి సత్యప్రకాష్, ఉపాధ్యక్షుడిగా రాణిమేకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మడుపల్లి మధు రవిశంకర్, జాయింట్ కార్యదర్శిగా అక్కినేని వెంకట రమాకుమారి, కోశాధికారిగా మల్లవల్లి రమేష్, లైబ్రేరియన్‌గా పొన్నపల్లి దుర్గారావు, మహిళా ప్రతినిధిగా దుర్గా పద్మాంజలి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి లింగమనేని రాజారావు శుక్రవారం తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.